సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 25 । మే । 2025



కలగానే చేనేత..

జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు సరైన సౌకర్యాలు లేకపోగా ప్రభుత్వం తరఫున ఎటువంటి సహకారం అందడం లేదు.

- 8లో ▸



అనుమతులకు అటవీశాఖ..

డబుల్‌రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.3
వాతావరణం

న్యూస్‌రీల్

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు



బాన్సువాడ : గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడలో కొన్ని పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు లేకుండానే ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనవెంట మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



కామారెడ్డి అర్బన్ : తలసేమియాతో బాధపడే చిన్నారుల కోసం రక్తదానం చేసేందుకు యువతీయువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి అన్నారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఈ నెల 26వ తేదీన లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద, ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఆదిత్య ఆస్పత్రి (కామారెడ్డి)లో నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి సంబంధించిన కరప్రతాలను ఏఎస్పీ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, లయన్స్ అధ్యక్షుడు చిలువేరి మారుతి, కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బిచ్కుంద(జుక్కల్) : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వినిల్‌కుమార్ అన్నారు. జూన్ 14వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో కోర్టు హాలులో శనివారం బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, ఎక్సైజ్ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. కక్షిదారులు రాజీపడి కేసులు పరిష్కరించుకునే చక్కటి అవకాశం లోక్‌అదాలత్ ద్వారా కలుగుతుందన్నారు. పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి అవగాహన కల్పించాలని సూచించారు.

గోవులను తరలించకుండా చర్యలు చేపట్టాలి



భిక్కనూరు: గోవులను అక్రమంగా తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి భాస్కరన్ సూచించారు. మండల పరిధిలోని టోల్ ప్లాజా వద్ద పోలీస్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఆయన సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల్లో అక్రమంగా గోవులను తరలిస్తే వెంటనే వాటిని గోశాలలకు తరలించాలన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి దేవేందర్, పోలీసులున్నారు.

విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి

కామారెడ్డి అర్బన్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, వ్యవసాయ బావులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు అత్యంత జాగ్రత వహించాలని విద్యుత్ సంస్థ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ కోరారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దని, అలాగే ఇళ్లలో దుస్తులు ఆరేసేందుకు ఇనుప వైర్లకు బదులుగా ప్లాస్టిక్ వైర్లను కట్టుకోవాలని ఎస్ఈ సూచించారు. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రతగా ఉండాలన్నారు. ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటల రక్షణకు విద్యుత్ కంచెల ఏర్పాటు అత్యంత ప్రమాదకరమని, వాటి కారణంగా మూగజీవాలు, రైతులు మృత్యువాత పడుతున్నారని హెచ్చరించారు. విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా 1912 నంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలని ఎస్ఈ సూచించారు.





ఆటల్లో రాటుదేలేలా..

- పేట్‌సంగెం బడిలో వేసవి ప్రత్యేక శిబిరం
- పద్నాలుగేళ్లుగా శిక్షణ ఇస్తున్న లక్ష్మణ్ రాథోడ్
- క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు

సండే స్పెషల్

కర్తవ్య నిర్వహణలో మనం ఎలా మసులుకునే విధానంపై ఆ నాడు లక్ష్మణుడు దిశానిర్దేశం చేయగా ఈనాటి లక్ష్మణుడు చేసి చూపుతున్నాడు. క్రీడల్లో ఎంతో మంది క్రీడాకారులను మెరికల్లా తీర్చిదిద్దుతున్న ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్‌రాథోడ్‌పై 'సాక్షి' సండే స్పెషల్..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : చదువే కాదు ఆటలు కూడా బతుకుబాట చూపుతాయని విశ్వసించే లక్ష్మణ్ రాథోడ్ గ్రామీణ క్రీడాకారులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తూ వారిని తీర్చిదిద్దుతున్నారు. స్వతహాగా క్రీడాకారుడైన లక్ష్మణ్ రాథోడ్ గాంధారి మండలం పేట్‌సంగెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ నిత్యం విద్యార్థులను క్రీడల్లో రాణించేలా తర్ఫీదు ఇస్తుంటారు. పాఠశాలకు సెలవులు ఉన్నా సరే తాను మాత్రం బడికి వెళ్లి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిందే. ఆయన దగ్గర ఆటల్లో నైపుణ్యాన్ని నేర్చుకున్న విద్యార్థులెందరో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వేసవి సెలవుల సమయంలో గ్రామీణ విద్యార్థులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఒక్కోచోట ఒక్కో క్రీడాంశాన్ని ఎంకరేజ్ చేస్తుంది. అందులో భాగంగా పేట్ సంగెం ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆటకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే పిల్లలకు వాలీబాల్ ఒక్కటే కాదు కబడ్డీ, అథ్లెటిక్స్‌లోనూ లక్ష్మణ్‌రాథోడ్ శిక్షణ ఇస్తున్నారు. గడిచిన 14 ఏళ్లుగా ఆయన వేసవి ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థులను క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. గాంధారి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు పేట్‌సంగెం ఉన్నత పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, అలాగే సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ఆదివారం రోజున ఐదు కిలోమీటర్ల రన్నింగ్ కూడా చేయిస్తున్నారు. ప్రతి రోజూ ఫిట్‌నెస్, డ్రిల్, వాలీబాల్ ఆటలో టెక్నిక్స్, సర్వ్, డిఫెన్స్, అటాక్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే లక్ష్మణ్‌రాథోడ్ తన సోదరుడి పేరుతో ఏర్పాటు చేసిన బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా క్రీడాకారులకు ఆటవస్తువులు సమకూరుస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆయా క్రీడాల్లో శిక్షణ పొందుతూ రాణిస్తున్నారు.



పేట్ సంగెం పాఠశాల ఆవరణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

క్రీడానైపుణ్యాన్ని పెంపొందించాలని..



క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు చాలా మంది సరైన ప్రోత్సాహం లేక ముందుకు వెళ్లడం లేదు. వేసవి సెలవుల్లో ఏర్పాటు చేస్తున్న శిక్షణ ద్వారా చాలా మంది తమకు ఇష్టమైన ఆటల్లో శిక్షణ పొంది రాణిస్తున్నారు. ఏటా 20 నుంచి 30 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. ఈ సారి కూడా 22 మంది ఉన్నారు. గ్రామీణ విద్యార్థులను జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి కష్టపడతా.

– లక్ష్మణ్‌రాథోడ్, ఫిజికల్ డైరెక్టర్, పేట్‌సంగెం

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు



లక్ష్మణ్ రాథోడ్ సార్ మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. క్రీడలపై ఉన్న ఆసక్తిని గమనించి మాకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నేను జాతీయ స్థాయి పాఠశాల క్రీడల్లో పాల్గొన్నా. వేసవి శిక్షణా శిబిరంలో మెలకువలు నేర్చుకుంటున్నాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడటమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాను.

– భూక్యా అర్జున్, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు, గుడితండా

జాతీయ స్థాయికి వెళ్లడమే లక్ష్యం



జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనడమే నా లక్ష్యం. ఇందుకు పీడీ సార్ ఇస్తున్న ప్రోత్సాహంతో వాలీబాల్‌లో రాణిస్తున్నాను. రోజూ ఉదయం రన్నింగ్‌తో మొదలై, ఫిట్‌నెస్‌కు సంబంధించి అంశాలను వివరిస్తారు. వాలీబాల్ ఆటలో ఎలా రాణించాలనే మెలకువలు నేర్చుకున్నాను. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు వెళ్లడమే నాలక్ష్యం.

– స్పజన, పేట్ సంగెం

మా ఊరికి పేరు తెస్తా



నాలో ఉన్న వాలీబాల్ క్రీడా నైపుణ్యాన్ని గమనించిన పీడీ సార్ ప్రోత్సహించడం ప్రారంభించారు. దీంతో ఆటపై మరింత ఆసక్తి పెరిగింది. వేసవి శిబిరంలో చాలా విషయాలు తెలుసుకోగలిగాను. జాతీయ స్థాయికి ఆడి మా ఊరుకు పేరు తీసుకురావడమే లక్ష్యంగా నేను ప్రిపేర్ అవుతున్నాను. కచ్చితంగా జాతీయ స్థాయిలో రాణిస్తా.

–సంధ్య, మాతుసంగెం

ఎంతగానో ఉపయోగపడుతోంది



వేసవి శిక్షణ శిబిరం ద్వారా పూర్తి స్థాయి సమయం క్రీడలపై పెడుతున్నాను. జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీకి వెళ్లడం కొంతలో మిస్ అయ్యింది. చిన్నచిన్న తప్పిదాలను గుర్తించుకుని వేసవి శిక్షణ శిబిరంలో కోచ్ లక్ష్మణ్ సర్ వద్ద మెలకువలు నేర్చుకుంటున్నాను. ఈ సారి కచ్చితంగా జాతీయ స్థాయికి ఆడడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాను.

– బానోత్ ఉష, గుడితండా

నకిలీ విత్తనాలను అరికట్టాలి



వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

- తనిఖీలకు టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు
- రైతులను మోసం చేస్తే పీడీ యాక్టు
- సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


కామారెడ్డి క్రైం : జిల్లాలో నకిలీ విత్తనాలు లేకుండా చేయాలని, ఇందుకోసం ఐదు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. వ్యవసాయ, పోలీసుశాఖలతో సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాప్తంగా 34 వేల ఎకరాల్లో ఈ సారి పత్తి సాగవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, పోలీసు అధికారులతో కూడిన జిల్లా స్థాయిలో ఒకటి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద డివిజన్‌లలో మరో నాలుగు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి నకిలీ విత్తనాలు సరఫరా చేసే, విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. లైసెన్స్ లేని కంపెనీలు, వ్యాపారులు, గుర్తు తెలియని వ్యక్తులు, తెల్ల సంచుల్లో విక్రయించే విత్తనాలు, గడువు ముగిసినవి, లేబుల్ సరిగా లేనివి, రాత్రికిరాత్రి గ్రామాల్లో తిరుగుతూ విక్రయించేవి, జన్యుస్వచ్ఛత లేని వాటిని నకిలీ విత్తనాలుగా పరిగణించడం జరుగుతుందని, అలాంటి విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. గతేడాది బీజీ–3 రకం పత్తి విత్తనాలు సాగు చేసిన, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల, గ్రామాల వివరాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలపై రైతులను చైతన్య పర్చాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే 89777 46219కు (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు) ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఏవో తిరుమల ప్రసాద్, పలువురు సీఐలు, ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

కేసుల విచారణ వేగవంతం చేయాలి

ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులకు సంబంధించి నమోదైన కేసుల విచారణను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బాధితులకు చట్ట ప్రకారం పరిహారం అందేలా చూడాలన్నారు. ఎస్పీ రాజేశ్‌చంద్ర, ఆర్డీవో వీణ, ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఎస్పీలు, ఎస్జీవోలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు సరఫరా

సాక్షి ఎఫెక్ట్..



నిజాంసాగర్(జుక్కల్): 'జీలుగ జాడేదీ' శీర్షికన ఈనెల 20వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లాకు 5 వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నేషనల్ సీడ్ కార్పొరేషన్ సంస్థ ద్వారా జిల్లాకు జీలుగ విత్తనాలు సరఫరా చేయాల్సి ఉంది. అయితే నిజామాబాద్ జిల్లాకు తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సంస్థ ద్వారా జీలుగ విత్తనాలు ఇప్పటికే పంపిణీ చేశారు. కాగా నేషనల్ సీడ్ కార్పొరేషన్ సంస్థలో జీలుగ విత్తనాల నిల్వలు లేకపోవడం, రైతుల అవసరాలను వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు వెయ్యి క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సరఫరా చేశారు. జిల్లాకు చేరిన జీలుగ విత్తనాలను మండలాల వారీగా వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేపడుతున్నారు.

గ్రామ పాలనాధికారులు రాబోతున్నారు..

- ఇతర శాఖల్లో భర్తీ చేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏలకు నేడు ఎంపిక పరీక్ష
- మొదటి విడతలో రాష్ట్రంలో 6 వేల పోస్టుల భర్తీ
- మలి విడతలో నోటిఫికేషన్ ద్వారా కొత్త వారికి అవకాశం!
- రెవెన్యూ పాలనను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు

కామారెడ్డి క్రైం : ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా అడుగులు వేస్తోంది. గతంలో తొలగించిన వీఆర్‌వో, వీఆర్‌ఏల స్థానంలో గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల వ్యవస్థను తీసుకువచ్చేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 10,696 పోస్టుల భర్తీకి అవకాశం కల్పించగా, ఇందులో కామారెడ్డి జిల్లాలోని 474 రెవెన్యూ గ్రామాలకు గ్రామ పాలనాధికారులు రానున్నారు. మొదటి విడతలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు ఆదివారం రోజున రాత పరీక్ష జరగనుంది. ఇందులో ఎంపికయ్యే వారికి జూన్ 2న పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

మొదటి విడతలో సగం మంది

రాష్ట్రంలో 10,696 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటిలో మొదటి విడతలో భాగంగా 6 వేల పోస్టులను భర్తీ చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి గతంలోనే ప్రకటించారు. దీనికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే ప్రారంభమైంది. కామారెడ్డి జిల్లాలో 474 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 90వ దశకంలో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి క్లస్టర్‌కు ఒక రెవెన్యూ అధికారిని కేటాయించింది. ఈ లెక్కన జిల్లాలో ఇదివరకు 215 మంది వీఆర్‌వోలు ఉండేవారు. వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను గత ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పాలన అధికారి పేరిట రెవెన్యూ అధికారుల నియామకం చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలో 474 రెవెన్యూ గ్రామాలకు పోస్టింగ్‌లు రానున్నాయి. ఇందుకోసం గతంలో పని చేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇంటర్ ఉత్తీర్ణులై గతంలో కనీసం 5 సంవత్సరాలపాటు వీఆర్‌వోగా గానీ, వీఆర్‌ఏగా గానీ పని చేసిన అనుభవం ఉన్న వారికి తిరిగి రెవెన్యూ శాఖ లోకి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. కామారెడ్డి జిల్లాలో ఇలాంటి వారు 402 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. వారందరికీ రాత పరీక్ష నేడు (25న) జరగనుంది. అందులో ఎంపికైన వారికి జూన్ 2న గ్రామ రెవెన్యూ అధికారులుగా పోస్టింగ్‌లు దక్కనున్నాయి. మిగిలిన పోస్టులను రెండో విడతలో నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు.

పడకేసిన రెవెన్యూ పాలన

గత ప్రభుత్వం 2015లో ధరణి పేరిట ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించి రెవెన్యూ రికార్డులను ఆన్‌లైన్ చేయించింది. ఈ ప్రక్రియ 2019 వరకు కొనసాగింది. రికార్డులను ఆన్‌లైన్ చేసే క్రమంలో ప్రతి జిల్లా రికార్డుల్లోనూ వేల సంఖ్యలో తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ధరణిలో వాటిని సరి చేసేందుకు ఆప్షన్‌లు లేక రైతులు నానా అవస్థలు పడ్డారు. సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే భావనతో ఉద్యోగులను ఇతర శాఖల్లో భర్తీ చేస్తూ 2022లో వీఆర్వో, 2023లో వీఆర్‌ఏ వ్యవస్థలను ప్రభుత్వం రద్దు చేసింది. అవినీతి వాస్తవమే అనే ఘటనలు సైతం అప్పట్లో చాలానే వెలుగుచూశాయి. కానీ వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేశాక గ్రామాల్లో పాలన మొత్తం దాదాపుగా పడకేసింది. రైతుల సమస్యలు ఎక్కడికక్కడే పడి ఉన్నాయి. ధరణిని రద్దు చేసి భూ భారతి సేవలు అందుబాటులోకి తేవడం, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం దొరకొచ్చని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. భూ భారతితోపాటు గ్రామపాలన అధికారుల వ్యవస్థ కూడా వస్తే రెవెన్యూ సేవలు వేగవంతం అయ్యే అవకాశాలు ఉంటాయి. జవాబుదారీతనం పెరిగి పనులు వేగవంతంగా పూర్తి కావొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్ నుంచి ఆయన కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే గ్రామ పాలన అధికారి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వీసీ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణకు కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, జిల్లాలో 402 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. అనధికార వ్యక్తులను పరీక్షాకేంద్రంలోకి అనుమతించొద్దన్నారు. అభ్యర్థులను నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, గాడ్జెట్‌లకు అనుమతి లేదన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వి విక్టర్, ఆర్డీవో వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, పరిశీలకులు శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో మసూద్‌అహ్మద్, పర్యవేక్షకురాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అందుబాటులోకి సేవలు



గతంలో వీఆర్‌వో, వీఆర్‌ఏలుగా పని చేసిన 402 మంది గ్రామపాలన అధికారి పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. రాత పరీక్షలో ఎంపికైన వారికి పోస్టింగ్‌లు దక్కుతాయి. జూన్ మొదటి వారంలో మొదటి విడతకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావచ్చు.

– మస్రూర్ అహ్మద్, కలెక్టరేట్ పాలనాధికారి, కామారెడ్డి

క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



రామారెడ్డి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడి ఆలయ హుండీ ఆదాయాన్ని సహాయ కమిషనర్ విజయరామా రావు, ఈవో ప్రభుగుప్తా ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. రూ.2,72,759 నగదుతోపాటు మిశ్రమ బంగారం,చ వెండి కానుకలను భక్తులు హుండీలో వేశారని సహాయ కమిషనర్ తెలిపారు. వేశారు. అర్చకులు శ్రీనివాస్‌శర్మ, వంశీశర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాగరాజ్, భక్తులు పాల్గొన్నారు.

28న జొన్న కొనుగోలు కేంద్రాల మూసివేత

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను ఈ నెల 28వ తేదీన మూసివేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 24 జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 10,999 మంది రైతుల నుంచి 28,498 మెట్రిక్ టన్నుల జొన్నలను సేకరించామని పేర్కొన్నారు. జొన్నల కొనుగోలుకు ఈ నెల 28 ఆఖరి తేదీ అని, మిగిలిపోయిన రైతులు తమ జొన్నలను 27వ తేదీలోగా కేంద్రాలకు తీసుకురావాలని స్పష్టం చేశారు.

రెట్టింపు ఉత్సాహంతో సేవలు అందించాలి



కామారెడ్డి క్రైం: పదోన్నతి పొందిన పోలీసు అధికారులు రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. రాజంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సంజీవులు ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఈసందర్భంగా శనివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన సంజీవులుకు ఆయన పదోన్నతి చిహ్నాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి బాధ్యతలను పెంచుతుందన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

కలగానే చేనేత.. కరువైన చేయూత

- గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో చేనేత శిక్షణ
- దుస్తులు నేస్తూ ఉపాధి పొందుతున్న చేనేత కార్మికులు
- జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని డిమాండ్



దోమకొండలో చేనేత శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

దోమకొండ: జిల్లాలో కామారెడ్డితో పాటు దోమకొండ, బీబీపేట, పిట్లం మండల కేంద్రాల్లో చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లో జిల్లా వ్యాప్తంగా రెండు వేలకు పైగా సభ్యులు ఉన్నారు. దోమకొండలోనే 600 చేనేత కుటుంబాలు ఉన్నాయి. వీరికి సరైన సౌకర్యాలు, ప్రభుత్వ పరంగా ఎలాంటి సహకారం అందడం లేదు. కామారెడ్డి ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తే నేతన్నలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దోమకొండలో ఒకనాడు మగ్గాలపై చేనేత కార్మికులు నేసిన దుస్తులు హైదరాబాద్‌తో పాటు గుజరాత్ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. మగ్గాలు మూలనపడి చేనేత కార్మికులు ప్రస్తుతం బీడీ పరిశ్రమపై ఆధారపడుతున్నారు. ఇక్కడ గతంలో ఉన్న నేతన్నలు ఉపాధి కోసం సిరిసిల్లా, మహరాష్ట్రలోని భీవండి, ముంబయి, షోలాపూర్ వంటి ప్రాంతాలకు కుటుంబాలతో వలస వెళ్లారు. దోమకొండలో గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో గత రెండు నెలల క్రితం మండల కేంద్రంలోని ఆనంద్‌భవన్‌లో చేనేత కార్మికులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. సిరిసిల్లా ప్రాంతం నుంచి శిక్షకులను రప్పించి గ్రామంలో ఆసక్తి ఉన్న వారికి చేనేతలో శిక్షణ ఇస్తున్నారు. చేనేత సహకార సంఘం వారి సూచనలతో ఆసక్తి ఉన్న పలువురు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. శిక్షణ సమయంలో కొంత నగదు కూడా ఇవ్వడంతో చాలా ముంది ముందుకు వస్తున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా దాదాపు 25 మందికి శిక్షణ ఇచ్చారు. వీరు నేసిన దుస్తులను హైదరాబాద్‌తో పాటు ఆంధ్రా ప్రాంతానికి సరఫరా చేస్తున్నారు. ఈ విషయంలో గడికోట ట్రస్టు ప్రతినిధులు చొరవ చూపడంతో పలువురు నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో చేనేత కుటుంబాలకు మేలు చేసినట్లువుతుంది. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని నేతన్నలు కోరుతున్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో శిక్షణ



దోమకొండలో గతంలో పెద్ద ఎత్తున చేనేత మగ్గాలు ఉండేవి.ప్రస్తుతం కార్మికులందరూ సిరిసిల్లాతో పాటు మహారాష్ట్రలోని భీవండి వంటి ప్రాంతాలకు వలసపోయారు. చేనేత వృత్తి కరుమరుగైంది. ఇక్కడి ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకురావాలని గడికోట ట్రస్టు నిర్వహకులు, సంస్థాన వారసులు కామినేని అనిల్ సూచించారు. చేనేత సహకార సంఘాల వారి సూచనలతో సిరిసిల్లా ప్రాంతం నుంచి శిక్షకులకు రప్పించి ఇప్పటి వరకు రెండు విడతలుగా 25 మందికి శిక్షణ ఇచ్చాము. వారు ప్రస్తుతం ఉపాధి పొందుతున్నారు.

– బాబ్జి, గడికోట ట్రస్టు మేనేజర్, దోమకొండ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రంజిత్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రంజిత్ సూచించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీటీం, కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఎంఈవో యోసెఫ్, ఏఎస్సై సాగర్, కళాబృందం ప్రతినిధులు, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..



మాట్లాడుతున్న షీటీం సభ్యులు ప్రభాకర్

బాన్సువాడ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో శనివారం పోలీసులు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. షీటీం సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేయాలని అన్నారు. సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉండాలని, మహిళల భద్రత కోసం షీటీం అందుబాటులో ఉంటుందన్నారు. మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, షీటీం సభ్యులు అనీల్, సాయిలు ఉన్నారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్ట్



సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఓ కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పట్టుకున్న పోలీసు బృందాన్ని ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. వివరాలు ఇలా. 2023లో హర్షద్ అలీ అనే వ్యక్తి ఢిల్లీ నుంచి బెంగళూరుకు బాస్మతి బియ్యంకు సంబంధించిన లోడ్ లారీతో బయలుదేరాడు. మార్గమధ్యలో యజమానికి తెలియకుండా మొత్తం బియ్యంను రూ.3.50 లక్షలకు విక్రయించి ఖాళీ లారీని దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొందుర్తి వద్ద రోడ్డు పక్కన వదిలిపెట్టి పరారయ్యాడు. పోలీసులకు దొరక్కుండా రెండు సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఎస్పీ రాజేశ్ చంద్ర సూచన మేరకు పోలీసులు ఇటీవల ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. నిందితుడు హర్షద్ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నట్లు తెలుసుకొని మూడు రోజుల క్రితం అక్కడికి వెళ్లారు. ఓ ప్రాంతంలో అతడిని గుర్తించి అరెస్టు చేసి జిల్లాకు తీసుకువచ్చారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ బృందాన్ని శనివారం ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు. బృంద సభ్యులైన దేవునిపల్లి ఏఎస్సై నర్సింగరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కానిస్టేబుళ్లు రవికుమార్, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి..



భిక్కనూరు: పలు ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన ఒక వ్యక్తిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన నరేష్ ట్రాక్టర్, డీసీఎం వాహనాలకు చెందిన బ్యాటరీలను చోరీ చేశాడు. అంతేకాకుండా కామారెడ్డితో పాటు మండల కేంద్రంలో పలు మోటార్ సైకిల్ దొంగతనాలు చేశాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. అనంతరం అతడి నుంచి రెండు మోటార్ సైకిళ్లు, ఆరు ట్రాక్టర్ డీసీఎం బ్యాటరీలు, ఒక సీసీ కెమెరా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

- ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక ఇప్పిస్తాం
- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బాన్సువాడలో లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత



కోటగల్లిలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడ : నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేస్తామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజురు పత్రాలను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజురు చేయించామని, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో తెలంగాణలోనే బాన్సువాడ నంబర్ వన్‌గా నిలిచిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజురు చేసిందని బాన్సువాడ పట్టణంలో 260 మందికి, బాన్సువాడ రూరల్‌లో 353 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేశామన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనాను లబ్ధిదారులకు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక ఇప్పిస్తామని, మేస్త్రీలను కూడా తక్కువ ధరకు ఇళ్లు కట్టేలా తాపి మేస్త్రీల యూనియన్ నాయకులతో మాట్లాడుతామన్నారు. ఇళ్లు మంజురు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వవద్దని సూచించారు. అనంతరం కోటగల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ చందర్, సీఈవో శంకర్, ప్రత్యేకాధికారి రాజు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

బీబీపేట/లింగంపేట : ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని బీబీపేట మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటికి ముగ్గు పోశారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు. లింగంపేట మండలకేంద్రంతో తో పాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో నరేష్ మార్కౌట్ ఇచ్చారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు రాజు, నాగేష్, కిరణ్ గ్రామ పెద్దలు లబ్దిదారులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తిర్మన్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావేటి సాయిలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని గొడ్డలితో నరికి హత్య చేసిన కొడుకు

- అయ్యపల్లి తండాలో దారుణం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి తండాలో కన్న కొడుకు తండ్రిని గొడ్డలితో నరికి హత్య చేసిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన దేవసోత్ ఫకీరానాయక్ (48)కు భార్య ఫంగి, కొడుకు ప్రకాష్, కూతురు ఉన్నారు. ఈనెల 16న వారు నూతన గృహ ప్రవేశం చేశారు. ఫకీరానాయక్ చెడు వ్యసనాలకు బానిసై మరో పెళ్లి చేసుకోడానికి ప్రయత్నించగా భార్య, కొడుకు అడ్డు తగులుతున్నారు. దీంతో శనివారం రాత్రి ఇల్లును తగలబెడతానని ఫకీరా గ్యాస్ సిలిండర్ ఓపెన్ చేశాడు. ఇల్లు తగలబడిపోతుందని వారించినా పట్టించుకోకపోవడంతో కోపోద్రిక్తుడై కొడుకు ప్రకాష్ పక్కనే ఉన్న గొడ్డలిని తీసుకొని తండ్రి ఫకీరానాయక్ మెడపై నరికాడు. దాంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు తండాకు చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై ప్రకాష్‌నాయక్ తెలిపారు.

క్రీడా అకాడమీల్లో ప్రవేశాలకు ఎంపికలు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా అకాడమీలు, వసతి గృహాల్లో ప్రవేశాలకు ఎంపికలను జూన్ 1 నుంచి 13వరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, హాకీ, వాలీబాల్, కుస్తీ విభాగాల్లో జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్‌లో, హనుమకొండ రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో జిమ్నాస్టిక్ ప్రవేశాలకు 14 ఏళ్లలోపు బాలురు అర్హులని వివరించారు.

క్రైం కార్నర్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్



బిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. టిప్పర్ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగి, వైర్లు రోడ్డుపై పడ్డాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వివరాలు ఇలా.. ఓ టిప్పర్ లక్ష్మీదేవునిపల్లి నుంచి అంతంపల్లి గ్రామం ద్వారా హైవే పైకి బయలుదేరింది. టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడంతో గ్రామంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో స్తంభం విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. పెద్ద ఎత్తున మిరుగులు రావడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

ట్రాక్టర్ పట్టివేత



సిరికొండ: సిరికొండ రేంజ్ పరిధిలోని అటవీ భూమిలో అక్రమంగా పొదలను తొలగిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో రవీందర్ శనివారం తెలిపారు. జినిగ్యాల తండాకు చెందిన సవాయిలాల్ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. అక్రమంగా అటవీ భూమిలో పొదలు తొలగిస్తున్నందుకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం'



రుద్రూర్: నేరాల నియంత్రణ కోసమే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీలో శనివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు చూపని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. స్థానికంగా అనుమానితులు, అపరిచితులు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు తీసుకువస్తే వాహనాన్ని విడుదల చేస్తామన్నారు. బోధన్, రుద్రూర్ సీఐలు కృష్ణ, వెంకట నారాయణ, ఎస్సైలు సాయన్న, మహేష్, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితులు ఉంటే సమాచారం ఇవ్వండి

ఖలీల్‌వాడి: స్థానికంగా అనుమానితులు, అపరిచితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. నగరంలోని హబీబ్‌నగర్, కొజ్జాకాలనీ, మాలపల్లిలో శనివారం వారు ఆపరేషన్ ఛబుత్రా నిర్వహించారు. కాలనీలో అనుమానితులను తనిఖీలు చేయడంతోపాటు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాలనీలోకి కొత్తగా వచ్చిన వారు, అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. రాత్రివేళ్లలో వాహనాలపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఖానాపూర్‌లో ఒకరి ఆత్మహత్య



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో వడ్డెపు లక్ష్మీనర్సయ్య (40)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ శనివారం తెలిపారు. లక్ష్మీనర్సయ్య భార్య రెండేళ్ల క్రితం ఇంట్లో గొడవపడి కూతురు, కొడుకుతో కలిసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాంపల్లి తండాలో వివాహిత..

డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి తండా గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు డిచ్‌పల్లి ఇన్‌చార్జి ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన రాథోడ్ సకుణ (50) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం సుద్దపల్లి చెరువులో మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి వివరాలు సేకరించారు. సకుణ కుటుంబీకులు మృతదేహాన్ని సకుణగా గుర్తించారు. భర్త సుదాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే సకుణ ఆత్మహత్య చేసుకోవడంతో సాంపల్లి తండాలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి, అంత్యక్రియలు నిర్వహించారు.

కుక్కల దాడిలో గాయపడిన మహిళ మృతి



రేణమ్మ(ఫైల్)

దోమకొండ: కుక్కల దాడిలో గాయపడ్డ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన చింపల్ల రేణమ్మ(38) పదిహేను రోజుల క్రితం ఉదయం ఇంటిముందు వాకిలి శుభ్రం చేస్తుండగా వీధి కుక్కలు కరిచాయి. దీంతో ఆమె స్పృహతప్పి పడిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త రాజు, ఇద్దరు కూతుళ్లు దేవిక, దివ్య, కుమారుడు సందీప్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..



దాస పద్మ(ఫైల్)

బాల్కొండ: కరెంట్ షాక్‌తో గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన దాస పద్మ(50) ఈ నెల 18న తన ఇంట్లో బోర్ మోటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడగా, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు శనివారం ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల తండాకు చెందిన బానోత్ అర్వినా అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై వెంకట్రావు శనివారం తెలిపారు. ఈనెల 22న ఇంట్లో ఎవరు లేని సమయంలో అర్విన బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్షానికి కూలిన ఇల్లు

రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో పాపవ్వ అనే మహిళకు చెందిన ఇల్లు వర్షాలకు కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో పాపవ్వ ఇంట్లో లేనందున ప్రమాదం తప్పింది. ప్రస్తుతం ఉండడానికి ఇల్లు లేక అవస్థలు పడుతుంది. ఆమెకు ఉన్న ఒక్క కొడుకు గతంలోనే మృతి చెందడంతో ఒంటరిగా ఉంటోంది. ఈ సమయంలో ఇల్లు కూలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరుతుంది.

పెచ్చులూడిన 'డబుల్' ఇంటి పైకప్పు: చిన్నారికి గాయాలు



బాల్కొండ: మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. శనివారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలోని మోహన్‌కు చెందిన ఇంటి పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మోహన్ కూతురు ప్రీతికకు స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో ఇళ్ల నాణ్యతపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే ఇళ్ల నాణ్యతను తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బంగారు నగల కోసమే మహిళ హత్య

గాంధారి(ఎల్లారెడ్డి): ఓ దివ్యాంగ మహిళతో ఓ యువకుడు కొన్నేళ్లుగా సన్నిహితంగా ఉంటూ ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగల కోసం హత్య చేయగా, నిందితుడిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని గుర్జాల్ గ్రామానికి చెందిన దివ్యాంగ మహిళ బ్యాగరి మణెవ్వ(37)కు ఇదే మండలం రాంలక్ష్మణ్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు కొండని రవీందర్ అలియాస్ ఈసంతపురం రవీందర్ రెండేళ్ల క్రితం పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. మణెవ్వకు ఒక కూతురు ఉండగా ఆరు నెలల క్రితం పెళ్లి చేసి పంపించారు. కూతురు పెళ్లిలో మణెవ్వ బంగారు నగలు ధరించగా, ఆ నగలను ఎలాగైనా కాజేయాలని రవీందర్ పథకం పన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న మణెవ్వకు అతడు ఫోన్ చేసి యాదగిరి గుట్ట సమీపంలో స్వర్ణగిరి గుట్టకు వెళ్దామని, కారులో ఎక్కించుకుని సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ తీసుకెళ్లాడు. కానీ అక్కడ హత్య చేయడం వీలు కాకపోవడంతో అర్ధరాత్రి రామాయంపేట్-మెదక్ రహదారిలో తొనిగండ్ల శివారుకు తీసుకెళ్లాడు. అనంతరం మణెవ్వ మెడకు చున్నీ చుట్టి ఊపిరి ఆడకుండా చేసి తలపై బండరాయితో మోదాడు. అనంతరం ఒంటిపై ఉన్న బంగారు నగలతో పాటు మణెవ్వ ఫోన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం స్థానికులు మహిళ మృతదేహాన్ని గమనించి రామాయంపేట్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు గుర్తుతెలియని మహిళగా గుర్తించి కేసు నమోదు చేశారు. విచారణలో మృతిచెందిన మహిళను మణెవ్వగా గుర్తించి, నిందితుడు రవీందర్‌గా గుర్తించారు. ఈమేరకు రామాయంపేట్ పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు.